శెనార్తి మీడియా
మన యాస.. మన బలం
GENERAL NEWS
శనివారం
15-08-2026
SHENARTHI MEDIA






# పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు ముమ్మరం



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు కరీంనగర్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆగస్టు 15న నిర్వహించనున్న వేడుకలకు అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.పరేడ్ గ్రౌండ్‌ను అలంకరిస్తూ, వేదిక, కూర్చునే ప్రదేశాలు, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై దృష్టి సారించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

# రైతులకు అండగా నిలవాలి

- **ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ**
- **బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్ గా ఒగ్గు దామోదర్ ప్రమాణ స్వీకారం**

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**




గ్రామీణ స్థాయిలో రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ వారికి అండగా నిలవాలని ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. బెజ్జంకి వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బెజ్జంకి వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఒగ్గు దామోదర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్‌తో పాటు నూతన డైరెక్టర్లను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రజా ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని అన్నారు. ప్రభుత్వం అందరికీ సమన్యాయం చేస్తుందని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి శ్రేయస్సుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# స్టూడెంట్ కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

కొత్తపల్లి మండలం రేకుర్తి విజన్ హైస్కూల్ లో ఇటీవల నిర్వహించిన స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలుపొందిన వారితో శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలుపొందిన వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థులందరూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను, క్రమశిక్షణను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. స్టూడెంట్ కౌన్సిల్ కమిటీ స్కూల్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. స్కూల్ హెడ్ బాయ్, స్కూల్ హెడ్ గర్ల్, స్కూల్ స్పోర్ట్స్ హెడ్ బాయ్ , స్కూల్ స్పోర్ట్స్ హెడ్ గర్ల్, స్కూల్ కల్చరల్ హెడ్ బాయ్ , స్కూల్ కల్చరల్ హెడ్ గర్ల్ వంటి విభాగాలలో అసిస్టెంట్ బాయ్స్, గర్ల్స్ తో ప్రమాణస్వీకారం చేయించి బ్యాడ్జ్ అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సందవేణి వెంకట్, ఇంచార్జి ప్రతిభ భారతి, టీచర్స్ పాల్గొన్నారు.

# తహసీల్దార్ సురేఖ జన్మదిన శుభాకాంక్షలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

తహసీల్దార్ సురేఖ జన్మదిన వేడుకలను తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ రవి కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. శంకరపట్నం మండలం కేశవపట్నం తహసీల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖకు నాయకులు, సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జీపీవోలు, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అరెపెల్లి ఓదెలు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ భద్రయ్య, రాజ కొమురయ్య, సమ్మయ్య, మెరుగు సురేష్, స్వామి, దామెర అశోక్, కేశవపట్నం గ్రామ శాఖ అధ్యక్షుడు బొజ్జ వినీత్ తదితరులు పాల్గొన్నారు.



# పింఛన్ల పంపిణీ వేగవంతం చేయాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



అర్హులైన లబ్ధిదారులందరికీ 'చేయూత' పింఛన్లు సకాలంలో అందేలా అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ ఎలాంటి అవాంతరాలు లేకుండా వేగంగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం శంకరపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి పింఛన్ల పంపిణీ, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజలకు ప్రత్యక్షంగా అందేలా చూడాలని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణాభివృద్ధి వేగాన్ని పెంచా లని సూచించారు. వీసీలో ఎంపీడీవో అనిత, ఎంపీఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులు ప్రారంభించాలి



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గుండ్లపల్లి స్టేజి నుంచి గన్నేరువరం మండల కేంద్రం మీదుగా పొత్తూరు వరకు రోడ్డు పనులను వారం రోజుల్లో ప్రారంభించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న డిమాండ్ చేశారు. పనులు ప్రారంభించకపోతే ఈ నెల 21న మండల ప్రజలు, అఖిలపక్ష నాయకులు, యువజన సంఘాల నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. గన్నేరువరం మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో గంప వెంకన్న మాట్లాడారు. రోడ్డు పనులు వెంటనే చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, గూడూరు సురేష్, లింగాల మహేందర్‌రెడ్డి, మీసాల ప్రభాకర్, తాడూరి కృష్ణారెడ్డి, బొడ్డు బాలయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో ముగ్గుల పోటీలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

సిబ్బందిలో ఐక్యత, సృజనాత్మకతతో పాటు దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ శ్రవణ్ కుమార్ తెలిపారు. ఆరోగ్య సేవలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సిబ్బంది చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి ముగ్గుల పోటీ నిర్వహించారు. పోటీలో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# నిరాధార ఫిర్యాదులు, తప్పుడు ప్రచారాన్ని ఉపేక్షించం

- **కలెక్టర్ కోయ శ్రీహర్ష**
- **అధికారులను అప్రతిష్ఠపాలు చేసేలా ఫిర్యాదు చేసిన వ్యక్తికి లోకాయుక్త రూ.10 వేల జరిమానా**
- **తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చట్టప్రకారం చర్యలు**



**పెద్దపల్లి, ఆగస్టు 14:** అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు.పెద్దపల్లి మండలం రాఘువాపూర్‌కు చెందిన బొబ్బిలి సత్యనారాయణ, గ్రామపంచాయతీ పరిధిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సరైన అనుమతులు లేవంటూ 2023 జనవరి 2న లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి నివేదికను లోకాయుక్తకు సమర్పించారని పేర్కొన్నారు.అధికారుల నివేదికను పరిశీలించిన లోకాయుక్త, సత్యనారాయణ ఫిర్యాదు నిరాధారమైనదిగా, వేధింపులకు ఉద్దేశించినదిగా పేర్కొంటూ 2025 డిసెంబర్ 22న కొట్టివేసినట్లు తెలిపారు. లోకాయుక్తతో పాటు ప్రభుత్వ అధికారుల విలువైన సమయాన్ని వృథా చేసినందుకు తెలంగాణ లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 13-A కింద రూ.10 వేల జరిమానా విధించినట్లు కలెక్టర్ వెల్లడించారు.లోకాయుక్త ఆదేశాల మేరకు జరిమానా మొత్తాన్ని రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేసి ముఖ్యమంత్రి సహాయనిధిలో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజా సమస్యలపై వాస్తవాధారాలతో చేసే ఫిర్యాదులను ప్రభుత్వం స్వాగతిస్తుందని, అయితే వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులను అప్రతిష్ఠపాలు చేసేలా నిరాధార ఆరోపణలు చేయడం, తప్పుడు సమాచారం ప్రచారం చేయడం సరికాదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

